క్లుప్తంగా

ఉత్సాహంగా సాగిన నృత్యం



కార్యక్రమానికి హాజరైన ప్రజలు

కడప కార్పొరేషన్: నగరంలోని రాజీవ్ పార్కు వద్ద కడప నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఛీర్‌ఫుల్ కడప ఉత్సాహంగా సాగింది. కార్యక్రమంలో విద్యార్థులు, చిన్నారులతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. నగర ప్రజలకు ఆహ్లాదకరమైన, ఉత్సాహ పూరిత వాతావరణాన్ని కల్పించేందుకు ఈ కార్యక్రమాన్ని ప్రతి ఆదివారం నిర్వహిస్తామని కమిషనర్ మనోజ్‌రెడ్డి తెలిపారు. ఇందులో పాల్గొని ప్రతిభ చూపిన వారికి బహుమతులు అందిస్తామని తెలిపారు.

గుర్తుతెలియని వృద్ధురాలికి అంత్యక్రియలు



మృతదేహాన్ని అంత్యక్రియలకు తీసుకువెళ్తున్న మేము సైతం సేవాసంస్థ సభ్యులు

కడప అర్బన్: కడప నగరంలోని రైల్వే స్టేషన్‌లో ఆదివారం ఆత్మహత్యకు పాల్పడిన గుర్తు తెలియని వృద్ధురాలు (60) ఆత్మహత్యకు పాల్పడ్డారు. కడప రైల్వే ఎస్ఐ శ్రీనివాసరావు విజ్ఞప్తి మేరకు మేము సైతం సేవా సంస్థ సభ్యులు అక్కడికి చేరుకుని ఆమెను ఆత్మబంధువుగా భావించి హిందూ సంప్రదాయం ప్రకారం అంత్యక్రియలు చేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు కె.అయ్యవారయ్య, రామలోకం, నరసింహ, రామరాజు, శివరాం, నాగేశ్వరరావు, పుల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

అల్పాహార వితరణ



అల్పాహార వితరణ చేస్తున్న సభ్యులు

కడప అర్బన్: వైఎస్ఆర్ జిల్లా ఒంటిమిట్ట వాస్తవ్యులు ఉద్దండం శ్రీను, లక్ష్మీల పెళ్లి రోజు సందర్భంగా కడప ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి(రిమ్స్)లో చికిత్స కోసం వచ్చిన రోగుల బంధువులకు ఆదివారం అల్పాహారం విందు వితరణ చేశారు. హిమవర్షిణి ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వితరణ కార్యక్రమంలో గుండ్లకొండ విజయలక్ష్మి, ఆర్టీసీ కానిస్టేబుల్ గుండ్లకొండ రవి, పుట్టా పురుషోత్తం, దామోదర్, గుండ్లకొండ శ్రీచరణ్ పాల్గొన్నారు.

కృత్రిమ పాదాల శిబిరం



మాట్లాడుతున్న శూలం లక్ష్మిదేవి

కడప ఎడ్యుకేషన్: చేతన ఫౌండేషన్ ఆధ్వర్యంలో కడప యూటీఎఫ్ భవన్‌లో ఆదివారం కృత్రిమ పాదాల కొలతల శిబిరం నిర్వహించారు. శిబిరంలో 80 మంది విభిన్న ప్రతిభావంతులకు కృత్రిమ పాదాల కొరకు కొలతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో చేతన ఫౌండేషన్ సభ్యులు దొడ్డా సీతారామయ్య మాట్లాడుతూ ఇప్పటి వరకు తమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 5 వేల మందికి కృత్రిమ పాదాలు, 2 వేల ట్రై సైకిళ్లు, 2 వేల వీల్ చైర్లు అందచేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు ముత్తినేని సురేష్, గణేష్, నవీన్, షేక్ రషీద్, శూలం లక్ష్మిదేవి, సుబ్బయ్య, మహి, శివ శంకర, విజయ్ అశోక్ ,రంజిత్ , మాధవ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చిన్నారుల సందడి



శిల్పారామంలో నృత్య ప్రదర్శన

కడప కల్చరల్: ఆదివారం ఆట విడుపు కార్యక్రమంలో భాగంగా శిల్పారామంలోని సాంస్కృతిక వేదికపై చిన్నారులు తమ ఆటపాటలతో సందడి చేశారు. పులివెందులకు చెందిన ఎస్‌కే డ్యాన్స్ అకాడమీ చిన్నారులు పలు జానపద, శాస్త్రీయ నృత్యాలు చేశారు. శిల్పారామం పాలనాధికారి శివప్రసాద్‌రెడ్డి పర్యవేక్షించారు.

వ్యక్తికి రక్తకణాల దానం

కడప కోటిరెడ్డిసర్కిల్: కడప బాలాజీ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న మహమ్మద్ షఫీకి అత్యవసర పరిస్థితిలో జేబీవీఎస్ సంస్థ సభ్యుడు మునివర్ధన్ రక్తకణాల దానం చేసి మానవత్వం చాటుకున్నారు. సంస్థ వ్యవస్థాపకుడు అశోక్ మాట్లాడుతూ అత్యవసర స్థితిలో డెంగీ, ఇతర వ్యాధుల కారణంగా రక్తకణాలు ఇచ్చేందుకు చాలామంది వెనకడుగు వేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పొట్టిశ్రీరాములు త్యాగం చిరస్మరణీయం

మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా



పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మేయర్ సురేష్ బాబు, అంజద్‌బాషా, తదితరులు

కడప కార్పొరేషన్: అమరజీవి పొట్టి శ్రీరాములు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర అవతరణకు చేసిన త్యాగం చిరస్మరణీయమని మేయర్ సురేష్‌బాబు, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా అన్నారు. పొట్టిశ్రీరాములు వర్ధంతి సందర్భంగా స్థానిక వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో ఆయన చిత్రపటానికి ఆదివారం వారు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంతకుమందు గోకుల్ లాడ్జి వద్దనున్న పొట్టిశ్రీరాములు విగ్రహం వద్ద మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆమరణ నిరాహారదీక్ష చేసి ప్రాణాలర్పించిన ×అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగం ఫలితంగానే భాషా ప్రయుక్త రాష్ట్రాలకు బీజం పడిందన్నారు. పొట్టిశ్రీరాములు వంటి కార్యదీక్షాపరులు పదిమంది ఉంటే, ఒక్క సంవత్సరంలోనే స్వాతంత్ర్యం సాధించవచ్చని గాంధీజీ అన్నాడంటే ఆయన పట్టుదల ఎలాంటిదో తెలుసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పులి సునీల్, బీహెచ్.ఇలియాస్, యానాదయ్య, సీహెచ్.వినోద్‌కుమార్, దాసరి శివప్రసాద్, షఫీ, గౌస్, కె.బాబు, అరీఫుల్లా, త్యాగరాజు, షంషీర్, పవర్ అల్తాఫ్, రామచంద్రయ్య, దేవిరెడ్డి ఆదిత్య, సునీత పాల్గొన్నారు.

కడప వైఎస్ఆర్ సర్కిల్: ఉక్కు మనిషిగా పిలువబడే సర్దార్ వల్లభాయ్ పటేల్, పొట్టి శ్రీరాములు తెలుగు రాష్ట్రానికి అందించిన సేవలు మరువలేనివని కాంగ్రెస్ పార్టీ నాయకులు బండి జకరయ్య, సయ్యద్ గౌసేపీర్ అన్నారు. నగరంలోని ఇందిరా భవన్‌లో వల్లభాయ్ పటేల్, పొట్టి శ్రీరాములు చిత్రపటాలకు ఆదివారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువత వల్లభాయ్ పటేల్‌ను ఆదర్శంగా తీసుకొని దేశ ప్రగతికి దోహదపడాలని ఆకాంక్షించారు. కాంగ్రెస్ నాయకుడిగా ఆయన సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకున్నాడని, పొట్టి శ్రీరాములు తన ప్రాణాలు పణంగా పెట్టి తెలుగు రాష్ట్రాన్ని సాధించాడన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

కడప ఎడ్యుకేషన్: అమరజీవి పొట్టి శ్రీరాములు ఆత్మార్పణంతో 1953లో ఆంధ్ర రాష్ట్రం ఏర్పడిందని అని డీసీసీ బ్యాంకు డిప్యూటీ రిజిస్ట్రార్ గుర్రప్ప పేర్కొన్నారు. కడప డీసీసీ బ్యాంకులో ఆదివారం పొట్టిశ్రీరాములు ఆత్మార్పణ దినం, సర్దార్ వల్లభాయ్‌పటేల్ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమరజీవి పొట్టి శ్రీరాములు ఆత్మార్పణంతోనే ఆంధ్ర రాష్ట్రం ఏర్పడిందన్నారు. ఇద్దరు దేశ భక్తులను రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలు మరవలేరన్నారు. ఈ కార్యక్రమంలో చంద్రశేఖర్, ఆంజనేయరెడ్డి, బాలాజీరాజు, వల్లూరు, సికెదిన్నె పిఏసిఎస్‌ల సిబ్బంది పాల్గొన్నారు.



పొట్టి శ్రీరాములుకు నివాళులర్పిస్తున్న గుర్రప్ప తదితరులు



పూలమాల వేస్తున్న కొండా సుబ్బయ్య, ఇతరులు

కడప ఎడ్యుకేషన్: ప్రాణాలను త్యాగం చేసిన మహానుభావుడు అమరజీవి పొట్టి శ్రీరాములు అని కొండా పాలకొండయ్య చారిటబుల్ ట్రస్టు చైర్మన్ కొండా సుబ్బయ్య అన్నారు. కడప నగరం కో–ఆపరేటివ్ కాలనీలోని సాయిబాబా అనాథ శరణాలయంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అబ్దుల్ రాయల్, కరీముల్లా, బద్రినారాయణ పాల్గొన్నారు.

తెలుగు భాష సమ్మేళనానికి ఆహ్వానం

కడప కల్చరల్: మైసూరులో ఈ నెల 18, 19వ తేదీల్లో జరగనున్న తెలుగు, కన్నడ భాష సమ్మేళనానికి కడప వాసి నాగదాసరి మునికుమార్‌కు ఆహ్వానం అందింది. మైసూరులోని భారత ఉన్నత విద్య మంత్రిత్వ శాఖ తదితర సంస్థలు రెండు రోజులపాటు ఈ సమావేశాలు నిర్వహించనున్నాయి. కర్ణాటక, తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాలకు సంబంధించి 20 మంది ఈ సమావేశాలలో వారి పరిశోధన పత్రాల సమర్పణ చేయనున్నారు. ప్రాచీన తెలుగు, కన్నడ లిపి, సాహిత్యాలకు గల సాంస్కృతిక సంబంధం, తెలుగు ఉగాది–యుగాది వైభవంపై పత్ర సమర్పణ చేయనున్నారు. ఈ సమావేశానికి హాజరు కానున్నారు.

వ్యాసరచన పోటీలు

కడప కల్చరల్: ప్రపంచ ధ్యాన దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నామని విశ్వాత్మ పిరమిడ్ యోగ సెంటర్ ప్రతినిధి జీవీఎస్ రెడ్డి, డాక్టర్ ఊర్మిల తెలిపారు. ఈ నెల 21న ధ్యానం గురించి అవగాహన కల్పించే కార్యక్రమం ఉంటుందన్నారు. విద్యార్థులు మూడు పేజీలకు మించకుండా ధ్యాన దినోత్సవం గురించి వ్యాసం రాసి 125–డి, గౌతమబుద్ధ టౌన్‌షిప్, ప్రకాశ్ నగర్, శివానందపురం రోడ్డు, కడప చిరునామాకు ఈ నెల 19వ తేదీలోగా పంపాలని వారు కోరారు. విజేతలకు బహుమతులతోపాటు ప్రశంసా పత్రాలు అందజేస్తామన్నారు. పూర్తి వివరాలకు 80748 26819 నెంబరులో సంప్రదించాలన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికులకు వేతనం పెంచాలి



మాట్లాడుతున్న స్రవంతి

కడప వైఎస్ఆర్ సర్కిల్: మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఏపీ మధ్యాహ్న వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు స్రవంతి పేర్కొన్నారు. నగరంలోని సీపీఐ కార్యాలయంలో విలేకరులతో ఆదివారం ఆమె మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించాలని అనేక మార్లు కోరినప్పటికీ కూటమి ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. తమ సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర వ్యాప్త ఉద్యమాలకు సిద్ధమవుతామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 85 వేల మంది ఈ పథకంలో పనిచేస్తున్నారని, ప్రభుత్వాలు మారినప్పుడల్లా కొందరిని తొలగించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వం ఎలిమెంటరీ స్కూల్, హైస్కూల్ విద్యార్థులకు ఇచ్చే సొమ్ము ఏమాత్రం సరిపోదన్నారు. కార్మికులకు తక్షణమే వేతనం రూ.10 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ అధ్యక్ష, కార్యదర్శులు వేణుగోపాల్, నాగసుబ్బారెడ్డి, మేరీ, లక్ష్మీపార్వతి పాల్గొన్నారు.

ఎస్సీ కులాల వర్గీకరణతోనే మాదిగలకు న్యాయం



సమావేశంలో మాట్లాడుతున్న కృపాకర్ మాదిగ

కడప రూరల్: ఎస్సీ కులాల వర్గీకరణతోనే తమకు న్యాయం జరుగుతుందని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కృపాకర్ మాదిగ అన్నారు. స్థానిక వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్ క్లబ్‌లో చీపాటి రాజేశ్వరరావు అధ్యక్షతన ఆదివారం జరిగిన సమావేశంలో కృపాకర్ మాదిగ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు సంబంధించి ప్రభుత్వం రాజీవ్‌రంజన్ మిశ్రా కమిటీని ఏర్పాటు చేసిందన్నారు. ఈ కమిటీ ఏర్పాటుతోనే సమస్యలు తీరిపోవని, మాదిగలు ఉత్సాహంగా కమిటీ ముందు హాజరై వాస్తవాలను తెలియజేయాలన్నారు. మాల, మాదిగలతోపాటు ఎస్సీలలో అన్ని కులాలు అభివృద్ధి చెందాలన్నారు. చీపాటి రాజేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ కులాలను వెంటనే గుర్తించాలని తెలిపారు. ఈ సమావేశంలో స్వామినాథన్, కె.యల్లయ్య, కె.బాలరాజు, జె.ప్రభాకర్, నగిలి గుర్రప్ప, వెదురూరు బాబు, డాక్టర్ గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

శిక్షణ తీసుకుంటే ఉత్తీర్ణత సులభతరం



సమావేశంలో మాట్లాడుతున్న సీవీ.ప్రసాద్

కడప ఎడ్యుకేషన్: ఉద్యోగులు శిక్షణ తీసుకుంటే డిపార్టమెంటల్ పరీక్షలలో సులభంగా ఉత్తీర్ణత సాధించవచ్చని ఏపీజేఏసీ జిల్లా చైర్మన్ శ్రీనివాసులు, ఏపీ ఎన్జీవో జిల్లా కార్యదర్శి రవికుమార్ పేర్కొన్నారు. ఏపీటీఎఫ్ అమరావతి ఆధ్వర్యంలో కడప ఎన్జీవో భవనం వద్ద ఆదివారం అవగాహన సదస్సు నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఉద్యోగులందరికీ నిబంధనలపై అవగాహన పెంపొందించే విధంగా ఉందన్నారు. భవిష్యత్తులో ఉద్యోగులకు వృత్తి నైపుణ్య సదస్సు ఏర్పాటు చేయాలని కోరారు. ఏపీటీఎఫ్ అమరావతి రాష్ట్ర అధ్యక్షుడు సి.వి.ప్రసాద్ మాట్లాడుతూ పింఛన్ కోడ్, ట్రెజరీ కోడ్, భారత రాజ్యాంగంపై పట్టు సాధిస్తే 141 పేపర్ ఉత్తీర్ణత సులభమవుతుందని తెలిపారు. ఏపీటీఎఫ్ అమరావతి కడప, అన్నమయ్య జిల్లాల అధ్యక్షులు ఈశ్వరచంద్ర, ఉమాకాంత్ మాట్లాడుతూ మోడల్ పేపర్లను ప్రాక్టీస్ చేసి ప్రశ్నాపత్ర స్వరూపం తెలుసుకోవాలని కోరారు. సదస్సుతో మొత్తం నల్లబల్లపై సిలబస్ వివరిస్తూ ఉద్యోగులచే ప్రశ్నావళి ప్రాక్టీస్ చేయించారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ అమరావతి నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, సత్యం, వీరప్రసాద్, పద్మజ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అరుంధతినగర్‌లో సమస్యలను పరిష్కరిస్తాం



కార్మికులతో మాట్లాడుతున్న డా.చంద్రశేఖర్

కడప కార్పొరేషన్: కడప అరుంధతి నగర్‌లోని సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డా.చంద్రశేఖర్ అన్నారు. మున్సిపల్ యూనియన్ నాయకులతో కలిసి ఆదివారం కాలనీలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఎంహెచ్ఓ మాట్లాడుతూ అరుంధతినగర్‌లో చాలా మంది కార్మికులు నివసిస్తున్నా.. మౌలిక వసతులు లేవన్నారు. మురికి నీటి కాలువలు, చెత్త సేకరణ, తాగునీటి సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు డి. ఆదాము, ఎస్. రవి పాల్గొన్నారు.

అమరజీవిగా నిలిచిన పొట్టి శ్రీరాములు

కడప ఇన్‌ఛార్జి ఎస్పీ వి. విద్యాసాగర్ నాయుడు

కడప అర్బన్: భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు అమరజీవి పొట్టి శ్రీరాములు ప్రాణత్యాగం చేసి ప్రజల మదిలో చిరస్థాయిగా నిలిచిపోయారని జిల్లా ఎస్పీ వి.విద్యా సాగర్ నాయుడు పేర్కొన్నారు. అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా కడప నగరంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ విద్యాసాగర్ నాయుడు అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా ఆ మహనీయుని చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు తెలుగు ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీక అని ఎస్పీ పేర్కొన్నారు. 1952 డిసెంబర్, 15న ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర సాధనకోసం పొట్టి శ్రీరాములు ఆత్మబలిదానం చేశారని కొనియాడారు. ఆంధ్ర రాష్ట్ర అవతరణ సమయంలో ఆయన త్యాగాలను ప్రతి ఒక్కరూ గుర్తు చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ బి.రమణయ్య, ఆర్ఐలు ఆనంద్, శ్రీశైలరెడ్డి, వీరేష్, టైటస్, ఆర్ఎస్ఐలు, పోలీసు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ అవినాష్‌రెడ్డి భేటీ



సయ్యద్ అర్షద్ మదనీతో మాట్లాడుతున్న ఎంపీ అవినాష్‌రెడ్డి, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

కడప కార్పొరేషన్: జమియత్ ఉలమా యే హింద్ జాతీయ అధ్యక్షుడు హజరత్ మౌలానా సయ్యద్ అర్షద్ మదనీతో కడప పార్లమెంట్ సభ్యుడు వైఎస్. అవినాష్ రెడ్డి, మాజీ డిప్యూటీ సీఎం అంజద్ బాషా ఆదివారం భేటీ అయ్యారు. కడప నగరంలో జరిగే భారీ బహిరంగ సభలో పాల్గొనేందుకు వచ్చిన ఆయనను వారు మర్యాద పూర్వకంగా కలిసి పలు అంశాలపై ఆయనతో చర్చించారు.

మైనార్టీల ఆర్థికాభివృద్ధికి కృషిచేయాలి

కడప రూరల్: ముస్లిం మైనార్టీల ఆర్థికాభివృద్ధికి చర్యలు తీసుకోవాలని జేకే యూత్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు ఖాదర్‌బాషా అన్నారు. స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహంలో ముస్లిం మైనార్టీ ప్రభుత్వ సలహాదారులు షరీఫ్, ముస్లిం మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ మౌలాన ముస్తాక్ అహ్మద్‌ను ఆదివారం ఆయన మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఖాదర్‌బాషా మాట్లాడుతూ కడప నగరంలో ముస్లిం మైనార్టీల ఆర్థికాభివృద్ధికి టైలరింగ్, బ్యూటీషియన్ రంగాల్లో శిక్షణ ఇవ్వాలన్నారు. వడ్డీలేని రుణాలను మంజూరు చేయాలని కోరారు. నగరంలో ముస్లిం మైనార్టీ మహిళలకు ప్రత్యేక ఆస్పత్రి ఏర్పాటు చేయాలని కోరారు. చాంద్‌బాషా, నజీర్ బాషా పాల్గొన్నారు.

రేపు పెన్షనర్ల దినోత్సవం

కడప సెవెన్‌రోడ్స్: కడప పాత రిమ్స్‌లోని బీసీ భవన్‌లో ఈ నెల 17వ తేదీ ఉదయం పది గంటలకు జాతీయ ప్రభుత్వ పెన్షనర్ల దినోత్సవం నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ పెన్షనర్ల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చెన్నారెడ్డి, రామ్మూర్తినాయుడు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో 75 ఏళ్లకు పైబడిన 50 మంది పెన్షనర్లను సన్మానిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే మాధవీరెడ్డి, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఘనంగా దత్త జయంతి



అలంకరణలో దత్తాత్రేయస్వామి

కడప కల్చరల్: దత్తాత్రేయస్వామి జయంతిని పురస్కరించుకుని ఆదివారం స్థానిక కోఆపరేటివ్ కాలనీలోని షిర్డి సాయిబాబా మందిరంలో స్వామికి విశేష పూజలు జరిపారు. వేకువ జామున స్వామికి రుద్రాభిషేకం చేసి, సాయి సత్యవ్రతాన్ని భక్తులచే సామూహికంగా నిర్వహించారు. మధ్యాహ్నం అన్న ప్రసాద వితరణ జరిగింది.

రాయలసీమ డిక్లరేషన్ పేరుతో బీజేపీ నాటకం



మాట్లాడుతున్న రాంభూపాల్

కడప వైఎస్ఆర్ సర్కిల్: డిక్లరేషన్ పేరుతో నాటకాలాడిన బీజేపీ రాయలసీమ ద్రోహిగా మారిందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ పేర్కొన్నారు. నగరంలోని వైఎస్ఆర్ మెమోరియల్ ప్రెస్ క్లబ్‌లో ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కడప ఉక్కు పరిశ్రమ విషయంలో సెయిల్, నాణ్యత పేర్లతో కపట నాటకం ఆడుతోందన్నారు. కేంద్ర బడ్జెట్‌లోనూ ఎలాంటి కేటాయింపులు చేయకుండా చోద్యం చూస్తోందని విమర్శించారు. టీడీపీ మద్దతుతోనే ఎన్డీయే ప్రభుత్వం కొనసాగుతోందని, ఆ పార్టీలు కడప ఉక్కు పరిశ్రమ ఏర్పాటు హామీపై స్పష్టత సాధించాలన్నారు. రాష్ట్రంలో పరిస్థితులను ఆసరాగా చేసుకుని కేంద్రం ఇష్టానుసారంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. నాణ్యత, ఫీజుబిలిటీ పేరుతో ఎంపీ సిఎం.రమేష్‌ను నిరాహార దీక్షకు పురమాయించి నాటకమాడారని, ఇపుడు ఆ ఎంపీ కూడా నోరు మెదపడం లేదని నిలదీశారు. వలసలు, రోడ్డుప్రమాదాలు, వ్యవసాయ కూలీలు, కరువు కాటకాలతో దేశంలోనే వెనుకబడిన రాయలసీమలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయడానికి 14 ఏళ్లు తీసుకుంటారా అంటూ ఉద్వేగంతో ప్రశ్నించారు. ఫిబ్రవరి ఒకటి, రెండు, మూడు తేదీల్లో నెల్లూరు జిల్లాలో నిర్వహించనున్న సీపీఎం రాష్ట్ర మహా సభల్లో కడప ఉక్కు ఉద్యమం ఉవ్వెత్తున జరిపేందుకు ప్రణాళిక రూపొందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్, నగర కార్యదర్శి రామమోహన్, మనోహర్, అన్వేష్, కామనూరు శ్రీనివా సులరెడ్డి, శివకుమార్ పాల్గొన్నారు.

ఇంధన పొదుపు వారోత్సవాల పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కమిషనర్ మనోజ్‌రెడ్డి

కడప కార్పొరేషన్: జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలను జయప్రదం చేయాలని ప్రభుత్వ విప్ రెడ్డెప్పగారిమాధవి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసులురెడ్డి, ఆర్‌డీఓ జాన్‌ఇర్విన్, నగరపాలక కమిషనర్ మనోజ్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఇంధన పొదుపు వారోత్సవాల పోస్టర్లను ఆదివారం వారు వేర్వేరుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భావి తరాలకు ఇంధనాన్ని అందించాలంటే పొదుపు పాటించాల్సిన అవసరం ఉందన్నారు. దీనిపై ప్రజల్లో విరివిగా అవగాహన కల్పించి, ఇంధన పరిరక్షణకు కృషి చేసిన పరిశ్రమలు, హోటళ్లు, ఆసుపత్రులు, ఇతర కార్యాలయాలకు అవార్డులు ఇస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈఈ హరిసేవ్యానాయక్, ఏడీఈ రూరల్ రామచంద్రారెడ్డి, ఏఈలు పాల్గొన్నారు.

విజయదుర్గాదేవి ఆలయంలో పౌర్ణమి పూజలు





అలంకరణలో విజయదుర్గాదేవి, కలశాలతో వస్తున్న భక్తులు

కడప కల్చరల్: పౌర్ణమి సందర్భంగా కడప నగరంలోని విజయదుర్గాదేవి ఆలయంలో అమ్మవారికి ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. వేకువ జామున పవిత్ర నదీ జలాలు నింపిన తొమ్మిది కలశాలతో నవకలశ స్నపనం నిర్వహించారు. అర్చకస్వాముల వేద మంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ ఉభయదారులు పవిత్ర కలశాలు చేతబూని ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేసి ఆ కళశాలను అర్చకులకు అందించగా స్వాములు ఆ పవిత్ర జలాలతో అమ్మకు నవ కలశ స్నపనం (అభిషేకం) చేశారు. అనంతరం యాగమండపంలో చండీహోమం చేయించారు. సాయంత్రం అమ్మవారికి 108 మంది ముత్తైదువులచే 108 దీపాలతో అష్టోత్తర శతదీపాలంకార సేవ నిర్వహించారు. రాత్రి ఎనిమిది గంటలకు అమ్మవారికి పల్లకీసేవ వైభవంగా నిర్వహించారు. మల్లికార్జునరావు, దుర్గా ప్రసాద్ పర్యవేక్షించారు.

అండర్–12 క్రికెట్ ఎంపికలకు విశేష స్పందన



క్రికెట్ ఎంపికల్లో పాల్గొన్న క్రీడాకారులు

కడప స్పోర్ట్స్: కడప నగరంలోని వైఎస్ రాజారెడ్డి–ఏసీఏ క్రికెట్ మైదానంలో ఆదివారం నిర్వహించిన జిల్లా స్థాయి అండర్–12 బాలుర విభాగం క్రికెట్ జట్టు ఎంపికలకు విశేష స్పందన లభించింది. ఈ ఎంపికలను క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ వైఎస్ఆర్ డిస్ట్రిక్ట్ (సీఏవైడీ) కార్యదర్శి అవ్వారు రెడ్డిప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంపికల్లో చక్కటి ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ప్రాబబుల్స్‌కు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ప్రాబబుల్స్‌కు ఎంపికైన క్రీడాకారులకు ప్రాక్టీస్ మ్యాచ్‌లు నిర్వహించి ప్రతిభ కనబరిచిన వారిని జిల్లా జట్టుకు ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ ఎంపికలకు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 100 మంది పైగా క్రీడాకారులు హాజరయ్యారు. సెలక్షన్ కమిటీ సభ్యులుగా కె.విష్ణుమోహన్‌రావు, ఎస్. ఖాజామైనుద్దీన్, పి.సంజయ్‌కుమార్‌రెడ్డి, ఎస్.మౌనిక, ఎం.సాయిపృథ్వీ, తదితరులు వ్యవహరించారు.

వైఎస్సార్‌సీపీ నాయకుల సంతాపం

కడప కార్పొరేషన్: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎంవీ.రామచంద్రారెడ్డి అత్త, మాజీ కార్పొరేటర్ నాగమల్లారెడ్డి తల్లి లక్కిరెడ్డి నాగసుబ్బమ్మ(86) మరణించారు. విషయం తెలుసుకున్న మేయర్ సురేష్ బాబు, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా అక్కాయపల్లెలోని వారి స్వగృహానికి వెళ్లి ఆమె మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు యానాదయ్య, దాసరి శివ, యల్లారెడ్డి, ఎంపీ శ్రీదేవి, షఫీ, తదితరులు పాల్గొన్నారు.





వడివడిగా వరినాట్లు విస్తారంగా వర్షాలు కురివడంతో నదులు, చెరువులకు నీరు చేరింది. దీంతో రైతులు వ్యవసాయ పనుల్లో బిజీ అయ్యారు. వరి పొలాలు సిద్ధం చేసుకుని నారు పెంచుకుంటున్నారు. మరిన్ని చెట్లు పొలంలో నాట్లు వేస్తున్నారు. చలమారెడ్డిపల్లి వద్ద నాట్లు వేస్తుండగా సాక్షి కెమెరా తీసిన చిత్రాలు ఇవీ.– సాక్షి సీనియర్ ఫొటోగ్రాఫర్